# వనమాల

లోగిలిలో దివ్వె ఉన్నది. మనిషి అలికిడి లేదు.

ఒకటికి రెండు పిలుపులకూ, పలికేవారు లేరు.

ఆలయంలో అర్చన, యింతకుముందే ముగిసింది.

ప్రసాద మందుకొని, సేవింపులవారు మడి విడిచి వస్తున్నారు. వారిలో, వీరు లేరు.

లేక ఏమైనారు? తాము విజయం చేస్తున్నామని వర్తమానము అందిందే-మరి, దర్శనం అనుగ్రహించరా దనుకున్నారా? ఆ మేరకు, తిరిగి కబురంపలేక పోయినారా? ఇంత దూరమూ రప్పించింది – ఇందుకా? మనము వెనుదిరిగేమా? –

వచ్చిన దిద్దరు! ఒకడు పైకి గంగి గోవు. ఒకరు కానవచ్చే గండుసింగం. సేలువువలె వాటుచేసుకున్న వీరగాథ!

సింగం ఉరుకూ – ఉద్రేకంతో మౌనంగా గర్జించి, మాటలు బుసకొట్టింది. ఆ కరుకుతనం కనువిందు చేసుకుంటూ, గంగిగోవో చదికిల పడ్డది.

పాల దుత్తతో వచ్చాడు చిన్నవాడు – ఆగంతుకుల వంక చూసినాడు. చూసీ – చూడనట్లు తన మానాన తాను లోపలికి పోతున్నాడు.

## 2

"ఎవరిది?" అన్నది సింగం – పంచమీద పాదం మోపి, వీరముద్రవేసి, పిడికిలి పట్టుకు చిబుకం ఊని, నిలుచునున్న ఆ గండు రౌతు వంక పరకాయించినాడు చిన్నవాడు.

"నేనే – చిన్నవాడ్ని!"

"ఎవరి చిన్నవాడివి?"

"చిరుతలు పట్టినవారి..."

"పేరు?"

"ఇంకా తెచ్చుకోలేదు."

గంగిగోవు చిరునవ్వు నవ్వింది.

"అయ్యగారి ఆల కాపరివా?" అన్నది.

"అయ్యగారే – ఆలకాపరి, నేను పాలమేపరిని!"

"లోగిలిలో ఎవరూ ఉన్నట్టు లేదే?"

"లేరు. ఈ అన్నమయ్య, అకడ కొండ మలుపులో – తులసి తోటలో పూసలు తరిమెన పడుతూ కూర్చొని – నేటికి మూడు పొద్దులాయె!"

"ఈ అమ్మ –"

"కోడలిని చూడ మనసై దిగువకు పోయె!"

"అహా! వారి వియ్యాలవారి యింటిపేరు?"

"ఇంటిపేరూ లేదు; ఇల్లూ లేదూ – అదో శూన్యం!"

"అదేమి?"

"చేసుకున్న పుణ్యం! వర్తి పెళ్ళికి వడ్డీ దండుగ –"

"అయ్యగారైనా, యీనాడు తిరిగివచ్చేరా?"

"వారి చిత్తం! వీరంత వారుకారా – తలకో బుద్ధి, తలో దేవుడు..."

"వారి కుమారులు..."

"వీరంతటి ఘనులే! ఎన్నడూ యింటిపట్టున ఉండదు – ఈ చాయలకే రాడు."

"అదేం?"

"అయ్య పెంపకం? – వర్తి తిమ్మడు!

"వాడి ఊసు మనకేలగాని, అయ్య దర్శనానికి వచ్చారా – దూరాభారంనించా? అలా నిలుచునే ఉన్నా వేమయ్యా, అన్నమయ్య కూర్చుని సంకీర్తనం చేసుకునే చోట – పాదం తాకించావేమయ్యా! కూర్చో! లోన గోపాలుడికి అరగింపుచేసి, ఆ పాలు మీకిచ్చేను అరగింతురు గాని...మన పుణ్యము బాగుండి, అమ్మగారు తిరిగి వస్తిరా సరి – లేదా యీ ప్రొద్దు కింతే! అదేమయ్యా, కూర్చోమంటిని కదా, కూర్చోవేమి? నీకేం సింహాసనం కావాలా? కూచో!"

"నాయనా! తెలియక అంటున్నావు., వారు రాయలవారు!" అన్నది గోవు.

"రాయల వారనఁగా?–"

"విద్యానగర ప్రభువులు! వీరవిక్రమావతార శ్రీకృష్ణ రాజేంద్రులు."

"ఆఁ! ఆ మారాజులా మీరు? నిజంగా చేయెత్తి మ్రొక్కాలి! స్వర్గంలోఉన్న రంభాది గణానికి సోమయాజి మూకను తప్పించి, కరుకు తురకలను కట్టిపెట్టిన ధర్మతంత్రివి ప్రభువు వైనందుకు ప్రజలందరి పాపమూ, పాపమని నీవేచేస్తున్న పుణ్యజనుడివి!"

"అబ్బాయీ!" అన్నాడు అప్పాజీ.

## 3

"పూర్వజన్మ సుకృతంవలె యెన్నడూ వెన్నంటి ఉండి, వీరినింతవారినిచేసిన తిమ్మన్నగారు తమరేకదూ! మీకో మ్రొక్కు మ్రొక్కాలి. దేశంలో ప్రజలను తురకల కన్న కరుకువారినిగా తీర్చి దిద్ది, యెదిరి చేలు కోయించి కుప్పలు వేయిస్తున్న శాంతమూర్తులు! శత్రు రుధిరంతో సంధ్యావందనం చేసే శ్రోత్రియులు..."

రాయలవారు హుంకరించినారు. చిన్నవాడి సిగ ఒడిసిపట్ట పోయినారు. తిమ్మరుసు రాయలవారిని సందిట పట్టుకుని మందలించినాడు. "చిరంజీవి! అయ్యగారి సేవకుడూ మనకు పూజనీయుడే!" అన్నాడు.

అంతలో వచ్చారు తిమ్మక్కగారు. అతిథులను పోల్చుకున్నారు. ఆదరించినారు.

"చిన్నవాడేమి చిలిపితనానికి పోయినాడో – మీరు మన్నించవలె! తిమ్మన్నబాబూ!

వీడు మా చిన్నవాడు. యెన్నడూ తమ దర్శనం చేయలేదు. వీనిమాటలకు ఏమనుకున్నారో – మన్నించండి. దీవించండి!"

తిమ్మన్నగారు ఆశ్చర్యపడినారు.

"అమ్మా! మీ పెద్దపిల్లవాడు..."

తిమ్మక్క కొడుకు వంక చూసింది. ఆ కొంటెతనం అర్థం చేసుకుంది. ఓహో అనుకుంది.

"గుడిలో ఉన్నాడు కాదూ, బాబూ! వాడు మా పెద్దపిల్లవాడు కాదూ! మీకు తెలియనే తెలియదా?"

"అమ్మా! వారు మీ దైవం కాదా?"

"నా దైవం మువ్వగోపాలుడు నాయనా! వీడు మా బిడ్డ!

"ఏదో యింతకాలమూ ఆ వరుసనే గడుపుకుంటూ వస్తున్నాము. మహారాజులు దయచేసినారని వారికి వర్తమానం చేయనా?"

"వద్దమ్మా, వారి దర్శనానికి మేమే పోయేము!"

రాయలవారు తిమ్మక్కకు మోకరిలి మ్రొక్కినారు. ఆ మ్రొక్కు గోపాలార్పణం.

చిన్నవాడు, ఆగంతుకులను అయ్యవారివద్దకి తోడుకొని పోయినాడు.

అన్నమయ్య రాయలవారిని కనులతో పలుకరించి, తిమ్మన్నగారితో సల్లాపము చేసినారు.

తాము రాజధానికి దయచేయవలెనని మనవి చేసినాడు రాయలు. "రాలేను" అన్నాడు అన్నమయ్య.

"కృష్ణరాయా! ఇక్కడ కామాటం ఎక్కువ. వీడు నన్ను వదిలి వుండడు. గుడి విడిచిరాడు. నేనూ రాలేను" అన్నాడు.

నేను మీతోబాటే ఉండిపోతాను అన్నాడు. రాయలు ఆ నిశ్చయంతోనే వచ్చాడు.

అప్పాజీ కలవరపడి కలుగజేసుకున్నాడు. రాయలు తన మనసు మారదన్నాడు. యీ రాజ్యం శాశ్వతమా? తనకు విరక్తి పుట్టింది. ధర్మదేవతకు తానొక్కడే రక్షకుడా?–

అన్నమయ్య చిరునవ్వు నవ్వాడు. "నాయనా! నీకు రక్తీ లేదు, విరక్తీ లేదూ. పుట్టుకతో వచ్చిన ఆసక్తి.

"రాజ్యభారము త్యజించి రాలేదు. మహారాజువలెనే వచ్చావు. ఆ ఠీవినే నన్ను నీవెంట తోడుకొని పోదలచావు. వీరుడిగా పుట్టి భక్తునిగా బ్రతకలేవు. విరాగివై కాలం వెళ్ళబుచ్చలేవు. ఉన్న తావునే అంత వైభవాలలోనూకాని, నీ అవతార సమాప్తికాదు. యిది అలయంలోవాని ఆదేశం.

"నా తులసిమాల నీకిచ్చేను. నేను వెంటవచ్చినట్లే.

"నీ మూర్తులు అలయంలో చిరస్థాయిగా నిలిపేందుకు కోనేటిరాయుడి ముగుదల అయినది. నీవిక్కడ వున్నట్లే. అదే నీకు దక్కే సుకృతం.

"మనం యెందుకు పుట్టామో, యెలా అవతరించామో అది మనచేతలేదు నాయనా! వాడికి యెరుక.

"పోయి రావయ్యా! అనడమే యిది మాటవరుసకే కాని మరల రాలేవు. ఆ ప్రాప్తము నీకు లేదులే.

"నీకిక ఆంధ్రనాయకుడు చేరువ. వారిని, వీరికి మారుగా సేవించుకో. నిలయము రణరంగమే అయినా, అంతరంగంలో కొంత శాంతి.

"అన్నట్టు యీ నడుమ కావ్య వినోదివైనావట. అదీ ఒకతీరు ఉద్రేకమే. నీకు వనరైనదే ఆ వ్యాసంగమే లగించుకో. వీర విహారంగా కవితలల్లు, కాలక్షేపమయేను. చేసిన సేత గణన కెక్కేను.

"రాయలూ! రక్తపాతమైనది కాని, నీవు సాధించినది లేదు. విద్యానగరము కలకాల ముండునది కాదు. నీ పేరున ఒక్క కావ్యము మిగిలినా నీ జన్మకు సుకృతము. సందె గోవిందా, యిక సాగిపో."

రాయలవారు తిరిగి రాజధానికి విజయంచేస్తూ చిన్నవాడివద్ద సెలవందుకున్నారు. "చిన్నవాడా, నీ దీవెన మాకు దయచేయ"మని వేడుకున్నారు.

చిన్నవాడు అన్నమయ్య చేసుకున్న పుణ్యంవలె, నిండుగా అన్నమయ్య చూపువలె, చల్లగా స్వామిసన్నిధిలో సామఘోషవలె, ఉద్ఘీథంగా యిలా పలికినాడు: "నన్నడిగి పుట్టలేదు. నాచేత పెరగలేదు. నా దీవెన నీకు అపోదులే. గుడిలో పడిగాపులుగా, ఆ రాతి నీతివాని ఎదురుగా, కంచుపోతగా ఖంగిలుమని కుదురుగా ఉండమన్నాడుగా అన్నమయ్య. అదే నీకు దీవెనైతే మఱెవరు పలికినా శాపమౌతుంది. నీకు పరివారంగా కొంతపాపజలం ఉండనేవుంది. దానికితోడు నీవు నరికిన తురకల యిల్లాళ్ళ గోడు నీకు మనుమలు నెత్తించేనులే. వారే తాతకట్టిన సౌధం కూలద్రోసి, మూటకట్టిన ముల్లె దోచుకునేరులే. అది నీ వ్రాత. మారాజా! నీ శిథిల ఘనతకు, జీర్ణవైభవానికి శాశ్వత రక్ష! అందుకు సాక్షి తుంగభద్ర. కెంపుడిగిన నిర్మల వాహిని, ఎన్నడైన గిరి కందరాల నీ పేరు మార్మోగించేనులే! అదే నీకొక్క తులసిపూస; యిదే నీ గీత!"

★ ★ ★